# వైసీపీ నేతలూ...! అబద్దాలు చెప్పడం మానుకోండి

## బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిని విమర్శిస్తే సహించం -టీడీపీ నేతల ఘాటు హెచ్చరిక

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి వైసీపీ నేతలు అబద్దాలు చెప్పడం మానుకుని ఆత్మపరిశీలన చేసుకోవాలని... శాసనమండలి ఎన్నికల్లో వైసీపీ వారు దొంగ ఓట్లు వేయించినట్లు నిరూపించడానికి తాము సిద్ధమని తెలుగుదేశం పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్ ఛార్జి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిని అనవసరంగా విమర్శిస్తే సహించమని ఆ పార్టీ నేతలు ఘాటుగా హెచ్చరించారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ఎన్టీఆర్ భవన్ లో బుధవారం తెలుగుదేశం పార్టీ నేతలు కాసరం రమేష్, చిన్నారెడ్డి, మిన్నల రవితో పాటు మరికొందరు మీడియాతో మాట్లాడారు. ఈ నెల 13న జరిగిన శాసనమండలి ఎన్నికల్లో శ్రీకాళహస్తిలో వైసీపీ నేతలు విచ్చలవిడిగా దొంగ ఓట్లు వేయించారన్నారు. అందుకు కొత్తపేట బాలికల ఉన్నత పాఠశాలలో తప్ప మిగిలిన కేంద్రాల్లో సుమారు 90శాతం వరకు పోలింగ్ నమోదైందన్నారు. బాలికల ఉన్నత పాఠశాలలో దొంగ ఓట్లు వేసే వారిని అడ్డుకోవడంతోనే అక్కడ పోలింగ్ శాతం తగ్గిందన్నారు. ఎంతో మందికి విద్యా బుద్ధులు నేర్పి... ప్రస్తుతం ధర్మకర్తల మండలి అధ్యక్షులుగా ఉన్న అంజూరు తారక శ్రీనివాసులు... విద్యా సంస్థలు నడిపే మిద్దెల హరి దొంగ ఓట్లపై అబద్దాలు చెప్పడం బాధ కలిగిస్తోందన్నారు. గౌరవ స్థానంలో ఉన్న వీరిద్దరూ అబద్దాలు చెబితే సమాజానికి ఏం సందేశం పంపుతారని వారు ప్రశ్నించారు. అబద్దాలు చెప్పేటపుడు ఈ నేతలు ఒకసారి ఆత్మ పరిశీలన చేసుకోవాలని టీడీపీ నేతలు హితవు పలికారు. శాసనమండలి ఎన్నికల్లో దొంగ ఓట్ల పోలింగ్ పై తాము 1వ పట్టణ సీఐ అంజూయాదవ్, శ్రీకాళహస్తి గ్రామీణ ఎస్ ఐ వెంకటేష్ కు మౌఖికంగా తెలియచేసినా వారు పట్టించుకోలేదన్నారు. గౌరవ స్థానంలో ఉన్న శ్రీకాళహస్తి శాసనసభ్యులు బియ్యపు మధుసూదనరెడ్డి ఏ అధికారంతో పోలింగ్ బూతుల్లోకి వెళతారని వారు ప్రశ్నించారు. తమ నేత బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి బయట నుంచి పోలింగ్ సరళి పరిశీలించారే తప్ప... ఎక్కడా నిబంధనలు ఉల్లంఘించలేదన్నారు. బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి రౌడీయిజం ఇంతవరకు ఏనాడైనా రౌడీయిజం చేయించినట్లు వైసీపీ నేతలు నిరూపిస్తే తాము దేనికైనా సిద్ధమని ప్రకటించారు. తమ నేత, తమ పార్టీ క్రమశిక్షణకు మారు పేరన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి శ్రీకాళహస్తిలో రౌడీయిజం బాగా పెరిగి పోయిందన్నారు. తెలుగుదేశం పార్టీ నేతలపై ఇప్పటికే పలు పర్యాయాలు భౌతిక దాడులు చేయడమే కాకుండా... తప్పుడు కేసులు బనాయించిన సంగతి వాస్తవం కాదా అని వారు ప్రశ్నించారు. రౌడీయిజంతో దొంగ ఓట్లు వేయించడమే కాకుండా మళ్లీ బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిని విమర్శించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైసీపీ వారు దొంగ ఓట్లు వేయించారని ప్రమాణం చేయడానికి తాము వైసీపీ కార్యాలయమైనా... దక్షిణామూర్తి సన్నిధికైనా వచ్చి ప్రమాణం చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని వారు స్పష్టం చేశారు. ధర్మకర్తల మండలి ప్రత్యేక ఆహ్వానితులు చింతామణి పాండు చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమన్నారు. వైసీపీ కొంతమంది నేతలు తమ స్థాయిని మరచి టీడీపీ నేతలపై విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇలాంటి విమర్శలు మానుకోక పోతే వైసీపీ నేతలకు భవిష్యత్తులో ప్రజలే తగుబుద్ధి చెబుతారన్నారు. ఇక పోలీసులు కూడా దొంగ ఓట్లు వేసిన వారిపైనా... దొంగ ఓట్లు వేయడానికి ప్రోత్సహించిన వారిపైనా చర్యలు తీసుకోకుండా అడ్డుకోవడానికి యత్నించిన తెలుగుదేశం పార్టీ నేతలపై అక్రమ కేసులు బనాయించడం ఎంతవరకు న్యాయమని వారు ప్రశ్నించారు. అధికార పార్టీ వైసీపీ నేతల ప్రోద్బలంతోనే పోలీసులు ఇలా చేస్తున్నారని వారు ఆరోపించారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న వైసీపీ నేతలకు ప్రజలే తగు గుణపాఠం చెప్పాలని వారు కోరారు. ఈ సమావేశంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులలో విద్యా సామర్థ్యాలను పెంపొందించండి

విశాలాంధ్ర- సత్యవేడు: విద్యార్థులలో విద్యాసామర్థ్యాలను పెంచాల్సి ఉన్నట్టు సత్యవేడు జడ్పిటిసి విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి కోరారు.బుధవారం ఆమె మండల పరిధిలోని కొత్త మారికుప్పం ఎస్టి కాలనీ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు.ఈ సందర్భంగా జడ్పిటిసి విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి విద్యార్థులు బోధన పద్ధతులను అడిగి తెలుసుకున్నారు.అయితే పిల్లల్లో విద్యా సామర్థ్యాలు ఆశించిన మేరకు లేకపోవడం పట్ల ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు.దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్రమణ్యంకు సూచించారు.పాఠ్యాంశాలను సులువైన పద్ధతిలో బోధన చేయాలన్నారు.విద్యార్థుల ఉన్నత చదువులు అభ్యసించాలంటే ప్రాథమిక విద్య పునాది అన్నారు. అందువల్ల విద్యా ప్రమాణాలు మెరుగుపరచడానికి ఉపాధ్యాయులు కూడా కృషి చేయాలన్నారు.తదనంతరం పిల్లల హాజరు,మధ్యాహ్న భోజన పథకము అమలు వంటి పలు అంశాలను జడ్పిటిసి విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి పరిశీలించడం జరిగింది.తదనంతరం మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి నాణ్యత పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.మెనూ ప్రకారం పిల్లలకు మధ్యాహ్నం భోజనం వడ్డిస్తున్నట్టు పరిశీలనలో వెల్లడైంది.కాగా ఈ పాఠశాలలో మొత్తం 40 మంది పిల్లలు చదువుకుంటున్నట్టు అధికారులు పేర్కొన్నారు.గ్రామ సర్పంచ్ నాగమ్మ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జడ్పిటిసి విజయలక్ష్మి చంద్రశేఖర్ రెడ్డి ఈ పాఠశాల సందర్శించి విద్యార్థుల విద్యా బోధనలో పలు సూచనలు ఇచ్చారు.

# సీఎంను కలిసిన ఎమ్మెల్యే

విశాలాంధ్ర - గూడూరు : ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని అమరావతిలో గూడూరు శాసనసభ్యులు డాక్టర్ వెలగపల్లి వరప్రసాద్ రావు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు పట్టణ ప్రజలు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారని, 2019 లో ప్రతిపక్షంలో ఉన్న సమయంలో గూడూరు పై ఓవర్ పూర్తి చేస్తామని వాగ్దానం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఆ ఫ్లైఓవర్ పనులు పూర్తి చేయడానికి కావలసినటువంటి అనుమతులు ఇప్పించవలసిందిగా ముఖ్యమంత్రిని కోరారు. కచ్చితంగా వచ్చే వారం బడ్జెట్ సమావేశం తర్వాత నిధుల మంజూరుకు సీఎం హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం ఆయన సెక్రటేరియట్ లో గూడూరు ఆటోనగర్ కి సంబంధించి ఏపీఐఐసీ ఎండి సృజన, చీఫ్ సెక్రటరీ పరిశ్రమలు, వాణిజ్య శాఖ కరికాల వలవాన్ లను కలిసి ఆటోనగర్ ని త్వరగా పూర్తి చేయాలని కోరారు.

## ఉద్యోగుల భవిష్య నిధి సంస్థలో న్యాయవాదుల ఎంపానెల్‌మెంట్ కొరకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - తిరుపతి : ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ జోనల్ ఆఫీస్, విజయవాడ, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్ ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ, కేంద్ర కార్మిక ఉపాధి మంత్రిత్వ శాఖ యొక్క చట్టబద్ధమైన సంస్థ తరఫున అమరావతిలో ఉన్న ఎన్‌సిఎల్‌టి- ఆంధ్రప్రదేశ్ మరియు ఇతర దిగువ కోర్టులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఉన్న సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ట్రస్టీస్, ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ కార్యాలయాలకు ప్రాతినిధ్యం వహించడానికి ప్యానెల్ న్యాయవాదులను శ్రీకాకుళం, అనంతపురం, కర్నూలు, కడప, చిత్తూరు నెల్లూరు ఎర్స్ వైల్ జిల్లాలకు నియామకం కొరకు దరఖాస్తులు ఆహ్వానించడం అయినదని జ్ఞానేంద్ర కుమార్ కనౌజియా ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్-తిరుపతి వారు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా/ స్టేట్ బార్ కౌన్సిల్‌లో నమోదు చేసుకున్న, ప్రాక్టీస్ చేస్తున్న న్యాయవాదులు ఎంప్యానెల్‌మెంట్‌కు అర్హులని, అర్హత గల ప్రాక్టీస్ చేసే న్యాయవాదులు తప్పనిసరిగా వెబ్‌సైట్ లో ఉన్న అనుబంధం మరియు అనుబంధం లో సూచించిన ఫార్మాట్‌లో దరఖాస్తును సమర్పించాలని, అర్హత, అనుభవం, ఫీజుల షెడ్యూల్, ఇతర నిబంధనలు మరియు షరతులు మరియు దరఖాస్తు చేయవలసిన దరఖాస్తు ఫార్మాట్ వెబ్సైట్ లో తెలిపిన మేరకు సమర్పించాలని కోరారు. అమరావతిలో ఉన్న కోసం దరఖాస్తు చేసుకునే న్యాయవాది తప్పని సరిగా విజయవాడ లేదా గుంటూరులో నివాసి అయి ఉండాలని, అదేవిధంగా పైన సూచించిన విధంగా నిర్దిష్ట జిల్లా కోసం దిగువ కోర్టులకు దరఖాస్తు చేసే న్యాయవాదులు తప్పనిసరిగా ఆ జిల్లా/ జిల్లా హెడ్ క్వార్టర్స్‌లో నివసిస్తూ ఉండాలని తెలిపారు.దరఖాస్తు చేసే కవర్ పేజీపై అమరావతి ఎంప్యానెల్‌మెంట్ ఆఫ్ అడ్వకేట్స్ శీర్షికతో సీలు చేసిన ఎన్వలప్‌లో కింది చిరునామా కు పంపవలెనని తెలిపారు.చిరునామా అదనపు సెంట్రల్ ప్రావిడెంట్ ఫండ్ కమీషనర్ ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్, నం.26-4-16,17, 2వ అంతస్తు జ్ఞానోలివ్ స్ట్రీట్, గాంధీ నగర్, విజయవాడ-520003. ఫోన్: 0866-2576700.

## చెన్నై శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో శాస్త్రోక్తంగా క్షీరాధివాసం



విశాలాంధ్ర - తిరుపతి : చెన్నై నగరంలోని జిఎన్ చెట్టి వీధిలో టిటిడి నూతనంగా నిర్మించిన శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ విగ్రహప్రతిష్ఠ, మహాకుంభాభిషేకం కార్యక్రమాల్లో భాగంగా బుధవారం సాయంత్రం శాస్త్రోక్తంగా క్షీరాధివాసం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి విగ్రహానికి అభిషేకం చేశారు. టిటిడి పాంచరాత్ర ఆగమ సలహాదారులు శ్రీ శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరుగుతున్నాయి.ఈ సందర్భంగా ఉదయం చతుష్టానార్చన, మూర్తిహోమం, ప్రాయశ్చిత్తం, పూర్ణాహుతి, కర్మాంగస్నపనం, విమాన నయనోన్మీలనం నిర్వహించారు. సాయంత్రం క్షీరాధివాసం చేపట్టారు.ఈ కార్యక్రమంలో చెన్నై స్థానిక సలహా మండలి అధ్యక్షులు శేఖర్ రెడ్డి, డెప్యూటీ ఈవో విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు వ్యవస్థపై ప్రజలకు మరింత నమ్మకం కలిగించాలి

## - అనంతపురం రేంజ్ డిఐజీ రవి ప్రకాష్ సూచన

విశాలాంధ్ర-చౌడేపల్లి : పోలీసు వ్యవస్థపై ప్రజలకు మరింత నమ్మకం కలిగించాలని అనంతపురం రేంజ్ డిఐజి రవి ప్రకాష్ పోలీసులకు సూచించారు.బుధవారం ఆయన చిత్తూరు జిల్లా,పుంగనూరు రూరల్ సర్కిల్ పోలీస్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డిఐజి రవి ప్రకాష్ మాట్లాడుతూ నేరాల నివారణపై మరింత దృష్టి సారించాలన్నారు.రాష్ట్రంలో రెండో ప్రముఖ శక్తిక్షేత్రమైన బోయకొండ ఆలయం పరిసర ప్రాంతాల్లో ఆరుబయట మద్యనిషేధం విధిస్తున్నట్లు తెలిపారు.మైనర్ బాలికలకు మాయమాటలు చెప్పి మోసం చేసే వారిపై గట్టి నిఘా ఉంచాలని అధికారులను ఆదేశించారు.ఫోక్సో చట్టం కేసులను ప్రత్యేకంగా చూస్తున్నామని,అదే తరహాలో నేరస్తులకు శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్టేషన్ల పరిధిలో ఎవరైనా రెండు మూడు సార్లు కేసులు నమోదైతే ప్రభుత్వ,ప్రైవేటు సంస్థల్లో పనిచేసేవారిని ఉద్యోగాల నుంచి తొలగిస్తారన్నారు. సైబర్ క్రైమ్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని,వారికి అవగాహన కల్పించాలన్నారు.నాటుసారా తయారీ,విక్రయాలు మరియు కర్ణాటక మద్యం అక్రమ రవాణా,విక్రయాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.పోలీసు స్టేషన్లకు వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని,నేరస్థులు ఎంతటి వారైనా శిక్షలు పడేలా చూడాలని,తద్వారా పోలీసు వ్యవస్థపై ప్రజలకు మరింత నమ్మకం పెరిగేలా కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా ఎస్పీ రిశాంత్ రెడ్డి,పలమనేరు డిఎస్పి సుధాకర్ రెడ్డి,పుంగనూరు రూరల్ సీఐ మధుసూదన్ రెడ్డి,చౌడేపల్లి ఎస్.ఐ.రవికుమార్ మరియు పోలీసు అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# వినాయకసాగర్ పనులు వేగవంతం చేయాలి : కమిషనర్

విశాలాంధ్ర - తిరుపతి : తిరుపతి నగరానికి వన్నె తెచ్చేలా ఏర్పాటు చేస్తున్న వినాయకాసాగర్ పనులను వేగవంతం చేయాలని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్, స్మార్ట్ సిటి ప్రాజెక్ట్ ఎండి అనుపమ అంజలి అధికారులకు సూచించారు. వినాయకసాగర్ వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను కమిషనర్ అనుపమ బుధవారం ఇంజనిరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వినాయకసాగర్ చుట్టూ ప్రజలను ఆకట్టుకునేలా అందంగా తయారు చేయాలన్నారు. ఫేస్ వన్ స్థాయి పనులను వచ్చే నెలలోపు పూర్తి చేసేలా అధికారులు పనులను పర్యవేక్షించాలన్నారు. వినాయకసాగర్ మధ్యలో ఏర్పాటు అవుతున్న డివైడర్లలో అందమైన చెట్లు వుండాలని, చుట్టూ పచ్చని గడ్డి లాన్ ఏర్పాటు చేయాలని, వాకింగ్ ట్రాక్ సిద్దం చేయాలని, చిన్న పిల్లలకు పార్క్, స్విమ్మింగ్ పూల్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కమిషనర్ అనుపమ అంజలి సూచించారు. అనంతరం అక్కారంపల్లె మాస్టర్ ప్లాన్ రోడ్ నిర్మాణ పనులను పరిశీలించి పనులను వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేసారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కమిషనర్ సునిత, సూపరింటెండెంట్ ఇంజనీర్ తిరుమాలిక మోహన్, మునిసిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, డిఈలు విజయకుమార్ రెడ్డి, సంజీవ్ కుమార్, డిప్యూటీ సిటీ ప్లానర్ దేవికుమారి, ఏయికామ్ ప్రతినిధి బాలాజీ పాల్గొన్నారు.

# శ్రీ నల్ల గంగమ్మకు శివయ్య సారె-సారెను సమర్పించిన చైర్మన్ అంజూరు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : బహదూర్ పేటలో వెలిసివున్న శ్రీ నల్ల గంగమ్మ కు శ్రీ జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం తరఫున సారేను శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు బుధవారం సమర్పించారు. శ్రీకాళహస్తి బహదూర్ పేటలో వెలిసి ఉన్న శ్రీ నల్ల గంగమ్మ జాతరను పురస్కరించుకుని శ్రీ జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం తరఫున సారే ను శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, పాలకమండలి సభ్యులు దేవస్థాన అధికారులు అమ్మవారికి వేదోయుక్తంగా సమర్పించారు. శ్రీకాళహస్తి ఆలయం నుంచి సారే ను శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఆధ్వర్యంలో ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు వేడుకగా తీసుకునీ రాగా, శ్రీ నల్ల గంగమ్మ ఆలయం వద్ద ఆలయ గంగమ్మ కమిటీ ఆధ్వర్యంలో స్వాగతం పలికారు. నల్ల గంగమ్మ ఆలయంలో అమ్మవారి మూలవిరాట్ వద్ద సాంప్రదాయ పద్ధతిలో సారే ను శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అక్కడి అర్చకులకు అందజేశారు. అనంతరం అమ్మవారికి విశేష పూజలు జరుపుకున్నారు. తదుపరి మూలస్థానంలో కొలువుతీరి ఉన్న నల్ల గంగమ్మ ఉత్సవ మూర్తిని శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు దంపతులు, ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు దర్శించుకున్నారు.దేవస్థానం చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ పంచభూత క్షేత్రాల్లో వాయు క్షేత్రమైన శ్రీకాళహస్తి క్షేత్రం నుంచి ఇకపై అన్ని ప్రముఖ ఆలయాలకు, శక్తి ఆలయాలకు విశేష రోజుల్లో పట్టు వస్త్రాలు, అమ్మవార్లకు సారే సమర్పణ చేయాలని, తమ ధర్మకర్తల మండలి తీర్మానించిందని తెలిపారు. మొట్టమొదటిసారిగా నల్లగంగమ్మ తల్లికి సారే సమర్పించే భాగ్యం తమ ధర్మకర్త మండలికి లభించడం పూర్వజన్మ సుకృతం అన్నారు. తమిళనాడులో వెలిసిన ప్రముఖ ఆలయాలు, శ్రీకాళహస్తి క్షేత్రంలో ఉన్న శక్తి ఆలయాలకు, అదే విధంగా శ్రీకాళహస్తి చుట్టుపక్కల నియోజకవర్గం లో కొలువు తీరిన ప్రముఖ శక్తి ఆలయాల కూడా ఆయా ప్రముఖమైన దినాల్లో దేవస్థానం తరఫున సారే సమర్పించి, ఆధ్యాత్మిక చింతన పెంపొందించే విధంగా తమ ధర్మకర్తల మండలి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఉప ప్రధానఅర్చకులు కరుణాకర్ గురుకుల్, వేద పండితులు వశిష్ట శర్మ, ధర్మకర్తల మండలి సభ్యులు, కొండూరు సునీత, పసల సుమతి, రమాప్రభ, లక్ష్మి ఆలయ అధికారులు, ఏఈఓ సతీష్ మాలిక్, టెంపుల్ సూపర్డెంట్ నాగభూషణం, టెంపుల్ ఇన్స్పెక్టర్ హరి యాదవ్, తాబేదార్ దాము, అటెండర్లు నాగరాజా, చైర్మన్ సిసి సుదర్శన్ రెడ్డి నల్ల గంగమ్మ కమిటీ చైర్మన్ కంట రమేష్, గ్రామ పెద్దలు స్వర్ణ మూర్తి పూల కృష్ణమూర్తి, నక్క రాజేంద్ర, కొట్టే అనిల్, కొట్టే నరేష్, కొట్టే సత్యనారాయణ, పత్తి మని, నరసింహులు, బాలా గౌడ్, తేజ, సునీల్ , నల్ల గంగమ్మ కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు

# ఏప్రిల్ 3 నుండి తిరుమలలో శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాలు

విశాలాంధ్ర - తిరుమల :తిరుమల శ్రీవారి ఆలయంలో ఏప్రిల్ 3 నుండి 5వ తేదీ వరకు మూడు రోజులపాటు సాలకట్ల వసంతోత్సవాలు అత్యంత వైభవంగా జరుగనున్నాయి. ప్రతి సంవత్సరం చైత్రశుద్ధ పౌర్ణమికి ముగిసేటట్లుగా ఈ ఉత్సవాలు మూడు రోజులపాటు నిర్వహించడం ఆనవాయితీ. ఏప్రిల్ 3వ తేదీన ఉదయం 7 గంటలకు శ్రీదేవి భూదేవి సమేతంగా శ్రీ మలయప్ప స్వామివారు నాలుగు మాడవీధులలో ఊరేగుతారు. అనంతరం వసంతోత్సవ మండపానికి వేంచేపు చేశారు. ఇక్కడ వసంతోత్సవ అభిషేక నివేదనలు పూర్తయిన అనంతరం తిరిగి ఆలయానికి చేరుకుంటారు.రెండవరోజు ఏప్రిల్ 4న శ్రీ భూ సమేత శ్రీ మలయప్పస్వామివారు ఉదయం 8 నుండి 10 గంటల వరకు బంగారు రథాన్ని అధిరోహించి తిరుమాడ వీధులలో ఊరేగుతారు. అనంతరం వసంత మండపంలో అర్చకులు వసంతోత్సవాన్ని నిర్వహిస్తారు. చివరిరోజు ఏప్రిల్ 5న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారితో పాటుగా శ్రీ సీతారామలక్ష్మణ ఆంజనేయస్వామి ఉత్సవర్లు, శ్రీ రుక్మిణి సమేత శ్రీకృష్ణస్వామి ఉత్సవమూర్తులు వసంతోత్సవ వేడుకల్లో పాల్గొని తిరిగి సాయంకాలానికి ఆలయానికి చేరుకుంటారు. ఈ సందర్భంగా ప్రతి రోజు మధ్యాహ్నం 2 నుండి 4 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహిస్తారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్ళు, పసుపు, చందనంతో అభిషేకం చేస్తారు. కాగా ప్రతి రోజు సాయంత్రం 6 నుండి 6.30 గంటల వరకు ఆస్థానం ఘనంగా నిర్వహిస్తారు. వసంత ఋతువులో శ్రీ మలయప్పస్వామివారికి జరిగే ఈ ఉత్సవానికి 'వసంతోత్సవ'మని పేరు ఏర్పడింది. ఈ క్రతువులో సుగంధ పుష్పాలను స్వామికి సమర్పించటమే కాక వివిధ ఫలాలను కూడా నివేదించడం ఈ వసంతోత్సవంలో ప్రధాన ప్రక్రియ.వసంతోత్సవాన్ని పురస్కరించుకొని ఏప్రిల్ 4న అష్టదళ పాదపద్మారాధన, ఏప్రిల్ 3 నుండి 5వ తేదీ వరకు కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టిటిడి రద్దు చేసింది.

# దొంగ ఓట్లు అంటేనే తెలియనట్లు నటిస్తున్న వైసిపి

## -బిసి వెల్ఫేర్ జెఏసి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్ రావు

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్ళలో తెలంగాణా ప్రాంతంలోని రజాకార్లు చేసిన ఆగడాలను మరిపిస్తూ, దొంగే.... దొంగ దొంగ అని అరచినట్లు ఎమ్మెల్సీ ఎన్నికలలో అన్ని అక్రమాలకు కారణమైన జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలోని వైసిపి నాయకులు దొంగ ఓట్లు అంటేనే తమకు తెలియనట్లు నటిస్తున్నారని తెలుగు నాడు విద్యార్థి సమాఖ్య మాజీ రాష్ట్ర కార్యదర్శి, బిసి వెల్ఫేర్ జెఏసి రాష్ట్ర కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో ఏ రాజకీయ పార్టీ కూడా వైసిపి లాగా దిగజారి వ్యవహరించలేదని ఆరోపించారు. అధికారాన్ని అడ్డు పెట్టుకొని ప్రజాస్వామ్య విలువలకు తిలోదకాలు ఇస్తూ శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధిలో పట్టభద్రుల ఓటు నమోదు ప్రక్రియ మొదలుకొని పోలింగ్ రోజు ఓటు హక్కు వినియోగించుకునే వరకు మొత్తం అక్రమంగా వ్యవహరించిన వైకాపా నాయకులు నీతులు మాట్లాడుతుంటే, దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. అన్ని అర్హతలు కలిగి దరఖాస్తు చేసుకున్న వారికి ఓటు హక్కు కల్పించకుండా, కనీసం పదో తరగతి కూడా పాసవ్వని వారికి పట్టభద్రుల జాబితాలో ఓటు హక్కు కల్పించిన విషయాలకు సంబంధించిన పత్రాలను బయటకు తెస్తే ఎవరు ఎంత నీతిమంతులో తెలుస్తుందని వైసిపి నాయకులను ఉద్దేశించి హెచ్చరించారు. తెలంగాణాలో రజాకార్ల ఆగడాలకు అక్కడి పోలీసులు ఏవిధంగా అయితే సహకరించారో, అదేవిధంగా నేడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పోలీసులు ఇస్తున్న దన్నుతో వైసిపి నాయకులు రెచ్చిపోతూ అరాచకం సృష్టిస్తున్నారని బిసి వెల్ఫేర్ జెఏసి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్ రావు ఆరోపించారు.

# 11ఎర్రచందనం దుంగలు స్వాధీనం

విశాలాంధ్ర - తిరుపతి : అన్నమయ్య జిల్లా రాజంపేట వద్ద 11ఎర్రచందనం దుంగలను టాస్క్ ఫోర్సు అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. టాస్క్ ఫోర్సు ఎస్పీ కే.చక్రవర్తి ఆదేశాల మేరకు డీఎస్పీ మురళీధర్ అధ్వర్యంలో ఆర్ఐ కృపానంద టీమ్ రాజంపేట రేంజ్ ఎస్ఆర్ పాలెం సెక్షన్ రోళ్ల మడుగు అటవీ ప్రాంతంలో కూంబింగ్ చేపట్టారు. పెద్దకోన తలగడ వద్ద కొంత మంది దుంగలను మోసుకుని వెళుతూ కనిపించారు. వారిని హెచ్చరిస్తూ సమీపించే సరికి, వాళ్ళు దుంగలను పడేసి పారిపోయారు. ఆ ప్రాంతంలో 11ఎర్రచందనం దుంగలు లభించాయి. దుంగలు స్వాధీనం చేసుకుని, పారిపోయిన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. దుంగలను తిరుపతి టాస్క్ ఫోర్సు పోలీసు స్టేషనకు తరలించారు. సీఐ బాలకృష్ణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# పరిశుభ్రమైన తాగునీటితో మంచి ఆరోగ్యం

విశాలాంధ్ర-తొట్టంబేడు: పరిశుభ్రమైన తాగునీటితో మంచి ఆరోగ్యం లభిస్తుందని ప్రగతి సంస్థ కో-ఆర్డినేటరు ప్రభాకర్ చెప్పారు. ప్రగతి సంస్థచే అమలు చేస్తున్న జల జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం తొట్టంబేడు మండలం పూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నీటి నాణ్యత, పరిశుభ్రత గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ... విద్యార్థులు పరిశుభ్రమైన నీటిని త్రాగడం వలన ఆరోగ్యంగా ఉంటారన్నారు. పంచాయతీ కార్యదర్శి జనార్ధన్ రెడ్డి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ చరణ్ ఆధ్వర్యంలో నీటి నాణ్యత పరీక్షను విద్యార్థుల సమక్షంలో నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవికుమార్, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, రమణమూర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

## శ్రీ తాళ్లపాక అన్నమయ్య520వవర్ధంతి కార్యక్రమాల

# పోస్టర్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - తిరుపతి : పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల వారి520వవర్ధంతి కార్యక్రమాల పోస్టర్లను టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి బుధవారం తిరుపతి పరిపాలన భవనంలోని తమ కార్యాలయంలో ఆవిష్కరించారు. అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో మార్చి 18 నుండి 21వ తేదీవరకు తిరుమల, తిరుపతితోపాటుఅన్నమయ్య జన్మస్థలమైన తాళ్లపాకలో వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమంలో జేఈవో సదా భార్గవి, ఎఫ్ఏసిఏవో బాలాజీ, ధార్మిక ప్రాజెక్టుల ప్రోగ్రామ్ అధికారి రాజగోపాలరావు, అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు డా. విభీషణశర్మ పాల్గొన్నారు.తిరుమలలో....మార్చి 18వ తేదీన సాయంత్రం 6 గంటలకు తిరుమలలోని నారాయణగిరి ఉద్యానవనంలో ప్రముఖ కళాకారులతో "సప్తగిరి సంకీర్తనా గోష్ఠిగానం" నిర్వహిస్తారు. తిరుపతిలో మార్చి 17న అలిపిరిలో మెట్లోత్సవంతిరుపతిలోని అలిపిరి పాదాలమండపం వద్ద మార్చి 17వ తేదీ ఉదయం 6 గంటలకు మెట్లోత్సవంవైభవంగా జరుగనుంది. అన్నమాచార్య కళామందిరంలో తిరుపతి లోని అన్నమాచార్య కళామందిరంలో మార్చి 18న సప్తగిరి సంకీర్తనల గోష్ఠిగానం నిర్వహిస్తారు. మార్చి 19 నుండి 21వ తేదీ వరకు సాహితీ సదస్సులు, సాయంత్రం 6 నుండి రాత్రి 8.30 గంటల వరకు సంగీత కార్యక్రమాలు జరుగనున్నాయి.మహతి ఆడిటోరియంలో..మహతి ఆడిటోరియంలో మార్చి 18 నుండి 21వ తేదీవరకు సాయంత్రం 6 నుండి రాత్రి 8.30 గంటలవరకు సంగీత కార్యక్రమాలు జరుగనున్నాయి. ఈ కార్యక్రమాల్లో సుప్రసిద్ధ సంగీత, నృత్య కళాకారులు పాల్గొంటారు.తాళ్లపాకలో మార్చి 18 నుండి 21వ తేదీవరకు తాళ్లపాకలోని ధ్యానమందిరం, 108 అడుగుల అన్నమయ్య విగ్రహంవద్ద సాయంత్రం 6.30 నుండి రాత్రి 9.30 గంటలవరకు సంగీతం, హరికథ కార్యక్రమాలు జరుగనున్నాయి.

# ఎస్వీయూ విసిని రీకాల్ చెయాలి

## -డా.నివేదిత మోరె

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి : గడచిన ఆరు దశాబ్దాల కాలంలో ఎంతోమంది విద్యావేత్తల అద్వితీయమైన కృషి ఫలితంగా సాధించుకున్న కీర్తి ప్రతిష్ఠలను కాపాడటంలో విఫలమైన శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపకులపతి రాజా రెడ్డిని రీకాల్ చెయ్యాలని శ్రీకాళహస్తి పురపాలక సంఘం 18 వ వార్డు మాజీ కౌన్సిలర్ డా.నివేదిత మోరె ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ను డిమాండ్ చేశారు.యుజిసి నిబంధనల ప్రకారం సుమారు ఆరు వందల మంది రెగ్యులర్ అధ్యాపకులు ఉండవలసి ఉండగా, కేవలం నూట అరవై మంది మాత్రమే ఉండటాన్ని గుర్తించిన న్యాక్ బృందం యూనివర్సిటీ తీరును ఎండగడుతూ గతంలో ఉన్న గ్రేడ్ ను తగ్గిస్తూ నివేదిక పంపడం చాలా బాధాకరమైన విషయమని డా.నివేదిత ఆవేదన వ్యక్తం చేశారు.అధ్యాపక నియామకాలు చేపట్టకుండా బోధనా ప్రమాణాలను దిగజార్చి, రాజకీయ నాయకుల భజనతో తమ పబ్బం గడుపుకునే అసమర్థ పాలకుల కారణంగానే యూనివర్సిటీ కీర్తి జాతీయ స్థాయిలో మసకబారిందని నివేదిత ఆవేదన వ్యక్తం చేశారు.శాశ్వత బోధకుల నియామకాలు చేపట్టి పరిశోధనా రంగాన్ని అభివృద్ధి చేయాల్సిన విశ్వవిద్యాలయ అధికారులు యూనివర్సిటీ ప్రాంగణంలో కులాల కుంపటి రాజేసి తమ పెత్తందారికి అడ్డులేకుండా చూసుకుంటూ, విశ్వవిద్యాలయ ప్రగతిని పక్కన పెట్టేశారని నివేదిత ఆరోపించారు.యస్వీయు కు అత్యున్నత గుర్తింపును తీసుకురావడంలో విఫలమైన యస్వీయు ఉపకులపతి మరియు ఇతర అధికారులను తక్షణమే తొలగించాలని డా.నివేదిత మోరె డిమాండ్ చేశారు.

విశాలాంధ్ర
చిత్తూరు జిల్లా

# మోడల్ కాలనీ లో మోసగాళ్ళు

**- యథేచ్ఛగా ఇంటి స్థలాలు కబ్జా - లక్షలు చేతులు మారుతున్న వైనం**
**- దళితులకు కేటాయించాలని డిమాండ్ - పరిశీలిస్తామన్న తహసిల్దార్**

**విశాలాంధ్ర-వెదురుకుప్పం:** రాజకీయ పలుకుబడి నాలుగు రూకలు ఉంటే దోచుకున్నోడికి దోచుకున్నంత చందంగా పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాలు యదేచ్ఛగా కబ్జాలకు పాల్పడుతున్న పరిస్థితి వెదురుకుప్పం మండలం తిరుమలయ్య పల్లి పంచాయతీ మోడల్ కాలనీలో పరిపాటిగా మారింది. గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో మొరవ గ్రామం చెరువు కట్టపై నివసిస్తున్న నిర్వాసితులకు, అలాగే నిరుపేద దళితులకు ఇంటి స్థలాలు కేటాయించి పక్కా ఇళ్లు నిర్మాణాలు చేపట్టాలని సదుద్దేశంతో వేణుగోపాలపురం గ్రామ రెవెన్యూ లెక్క దాఖల్లో 221/4 సర్వే నంబరు లో 6.50 ఎకరాల విస్తీర్ణం భూమిని కొనుగోలు చేసింది.అందులో మోడల్ కాలనీ ఏర్పాటు చేయాలని విద్యుత్తు, సిసి రోడ్లు తదితర సౌకర్యాలను కూడా కల్పించింది. అప్పట్లో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో కొంతమందికి ఇంటి పట్టాలు మంజూరు చేశారు. ఆ తర్వాత కొందరు స్థానికేతరులు కూడా కొందరు రాజకీయ పలుకుబడి ఉపయోగించి మోడల్ కాలనీలో నకిలీ పట్టాలతో ఇల్లు నిర్మించారని స్థానికులు చెబుతున్నారు. మరికొందరు పట్టాలు లేకపోయినా పునాదులు వరకు నిర్మించి కబ్జాలకు పాల్పడ్డారని స్థానికంగా దళితులు ఆరోపిస్తున్నారు. కాగా కొందరు ఎటువంటి పట్టాలు,అర్హతలు లేకపోయినా ఇంటి నిర్మాణాలు చేసి అమ్మకాలు, కొనుగోలు జరిపారని చెప్పారు. ఇదే విషయమై బుధవారం మోడల్ కాలనీ లో ఇరు వర్గాల మధ్య గొడవలు చోటు చేసుకున్నాయి. గ్రామ రెవెన్యూ అధికారి బాబు సంఘటనా స్థలానికి చేరుకుని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లి త్వరలో సమస్య పరిష్కరిస్తామని చెప్పారు.ప్రభుత్వ ఏర్పాటు చేసిన మోడల్ కాలనీలో కొందరు ఇంటి స్థలాల వ్యాపారాలు చేస్తున్నారని లక్షలు చేతులుమారుతున్నాయని విమర్శలు వస్తున్నాయి. అర్హులైన పేదలకు ,దళితులకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.మోడల్ కాలనీ లక్ష్యాలకు అనుగుణంగా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.ఇదే విషయమై తహసిల్దార్ పుల్లారెడ్డి వివరణ కోరగా కొద్దీ రోజులనుంచి తిరుమలయ్యపల్లి మోడల్ కాలనీ లో ఇంటి పట్టాల పై సమస్య వుంది. త్వరలో మోడల్ కాలనీ పరిశీలించి చర్యలు తీసుకుంటాం అన్నారు. ఫేక్ పట్టాలు గుర్తించి రద్దు చేస్తామన్నారు మోడల్ కాలనీ లో అర్హత ఉన్నవాళ్లకే పట్టాలు మంజూరు చేసే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# మహిళలపై దాడుల నివారణకు ప్రత్యేక చర్యలు:డిఐజి

**విశాలాంధ్ర-పలమనేరు:** స్థానిక డి.ఎస్.పి కార్యాలయం వద్ద బుధవారం విలేకరుల సమావేశాన్ని డిఐజి రవి ప్రకాష్, ఎస్పీ ప్రశాంత్ రెడ్డి నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో తరచూ మహిళలపై అఘాయిత్యాలు నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అదేవిధంగా సబ్ డివిజన్ పరిధిలో ఫోక్సో కేసులు అధికమవుతున్నాయని వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. అదేవిధంగా కర్ణాటక రాష్ట్రం నుండి టెట్రా ప్యాకెట్లు రవాణాపై ప్రత్యేక దృష్టి సాధించాలని తెలిపారు. అదేవిధంగా వివిధ కళాశాలలో గంజాయి పై అవగాహన కలిగించాలని వాటి నివారణకు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నామన్నారు.అనంతరం కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి సుధాకర్ రెడ్డి, సీఐ చంద్రశేఖర్,ఎస్సై నాగరాజ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా సూగుటూరు గంగమ్మ జాతర

**విశాలాంధ్ర - పుంగనూరు:** పట్టణంలో జరుగుతున్న సుగుటూరు గంగమ్మ జాతర అంగరంగ వైభవంగా రెండో రోజు జరిగింది బుధవారం రోజు రాత్రి అమ్మవారు ఊరేగింపు తర్వాత అమ్మవారిని జమీందారుల నగిరి ప్యాలస్ నందు ఉన్న ఆలయంలో అమ్మవారిని భక్తుల దశనార్థం ఏర్పాటు చేయడం జరిగింది ఆంధ్ర కర్ణాటక తమిళనాడు నుండి తరలివచ్చిన లక్షలాది భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించుకుని తీర్థప్రసాదాలు పొందడం జరిగింది ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి వచ్చిన భక్తులందరికీ భక్తులందరికీ దర్శన భాగ్యం కల్పించడం జరిగింది రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అమ్మవారికి బంగారు తో కూడిన నక్లీస్ ను బహుమానంగా అమ్మవారికి అలంకరించడం జరిగింది. అదే రీతిలో రాష్ట్ర యువ నాయకులు ప్రముఖ పారిశ్రామికవేత్త బి రామచంద్ర యాదవ్ అమ్మవారికి దాదాపు 200గ్రా బంగారు హారమును బహుకరించారు. అంతేకాక అమ్మవారిపై ఉన్న భక్తితో మగవారు సైతం అమ్మవారు వేషంలో గిరిగలు మోసుకుంటూ అమ్మవారికి మొక్కులు చెల్లించారు. ప్రత్యేక వేషధారణతో భక్తులను ఆదరించారు. బుధవారం రాత్రంతా అమ్మవారి దర్శనం భక్తులు కల్పించే విధంగా ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. భక్తుల దర్శనార్థం తర్వాత గురువారం రోజున అమ్మవారిని ర్యాలీగా తీసుకుని వెళుతూ జలిజి కార్యక్రమం చేయడంతో గంగ జాతర ముగుస్తుంది.

# నేడే ఎమ్మెల్సీ ఎన్నికల కౌంటింగ్

**కౌంటింగ్ కేంద్రం వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు**

**విశాలాంధ్ర -చిత్తూరు:** ఉమ్మడి ప్రకాశం నెల్లూరు చిత్తూరు పట్టభద్రులు ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాల ఓట్ల లెక్కింపును గురువారం నిర్వహించనున్నారు. ఇందుకోసం అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. ప్రకాశం నెల్లూరు చిత్తూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపును చిత్తూరు సమీపంలోని ఆర్ వి ఎస్ ఇంజనీరింగ్ కాలేజీలోనూ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల లెక్కింపును ఆర్ వి సి లా కాలేజ్ లో చేపట్టనున్నారు. ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాలకు సోమవారం పోలింగ్ జరగగా బ్యాలెట్ బాక్స్ లను కట్టుదిట్టమైన బందోబస్తు మధ్య చిత్తూరు ఆర్వీఎస్ ఇంజనీరింగ్ కాలేజీలోని స్ట్రాంగ్ రూములో భద్రపరిచారు. ఉపాధ్యాయ స్థానానికి 14 టేబుళ్లు, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 40 టేబుల్లు ఏర్పాటు చేశారు . ఉదయం 8 గంటల నుంచి ఓట్ల లెక్కింపు పక్రియను నిర్వహించనున్నారు. ఇందుకోసం 916 మంది సిబ్బందిని నియమించారు. ముందుగా పోస్టల్ బ్యాలెట్ ను అధికారులు లెక్కించి అనంతరం బ్యాలెట్ బాక్స్ లోనే ఓట్ల లెక్కింపును చేపటనున్నారు .ప్రకాశం నెల్లూరు చిత్తూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 22 మంది అభ్యర్థులు పోటీ పడుతుండగా, ఉపాధ్యాయ స్థానానికి 8 మంది బరిలో నిలిచారు. పట్టపద్రుల ఎమ్మెల్సీ కి 2,68,387 ఓట్లు , ఉపాధ్యాయ స్థానానికి24741 ఓట్లు పోలయ్యాయి. ఓట్ల లెక్కింపు కోసం 193 మంది కౌంటింగ్ సూపర్వైజర్లు, 551 మంది కౌంటింగ్ అసిస్టెంట్లు, 172 మంది మైక్రో అబ్జర్వ్ లను నియమించారు. కౌంటింగ్ లో పాల్గొని ఏజెంట్లకు పాసులను జారీ చేశారు. కౌంటింగ్ కేంద్రాల్లోనికి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు సెల్ఫోన్లను అనుమతించడం జరగదని అధికారులు తెలిపారు. ఈ ఓట్ల లెక్కింపు భిన్నంగా ఉన్న నేపథ్యంలో విడతల వారీగా సిబ్బంది ఓట్ల లెక్కింపులో పాల్గొననున్నారు. సిబ్బందికి ఈ ఓట్ల లెక్కింపు పై ఇదివరకే రెండు విడుదలగా ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ప్రత్యేక హెల్ప్ డెస్క్ పాటు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటన చోటు చేసుకోకుండా ఆర్ వి సి ఇంజనీరింగ్ కాలేజ్ సమీపంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్నికల పరిశీలకులైన కోన శశిధర్, భాస్కర్, జిల్లా ఎన్నికల అధికారి హరి నారాయణ ఆధ్వర్యంలో ఈ ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఫలితం గురువారం అర్ధరాత్రి కి వచ్చే అవకాశం ఉండగా, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఫలితం మాత్రం రెండు రోజులు పట్టే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

# కౌంటింగ్ కేంద్రం వద్ద భారీ బందోబస్తు:ఎస్పీ

**విశాలాంధ్ర -చిత్తూరు:** ఉమ్మడి ప్రకాశం నెల్లూరు చిత్తూరు పట్టభద్రులు ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాల ఓట్ల లెక్కింపు కేంద్రం మైన చిత్తూరు ఎస్ వి సెట్ ఇంజనీరింగ్ కాలేజీ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ రిశాంత్ రెడ్డి తెలిపారు. అధికారులు జారీ చేసిన పాసులు ఉంటేనే కౌంటింగ్ కేంద్రంలోకి అనుమతించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎలక్ట్రానిక్ వస్తువులతో పాటు సెల్ఫోన్లో కూడా అనుమతించమని తెలిపారు. వాహనాల కోసం ప్రత్యేకంగా పార్కింగ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన ఏర్పాటు చేసినట్లు వివరించారు. కౌంటింగ్ అనంతరం ఎలాంటి విజయోత్సవ ర్యాలీలు ప్రదర్శనలు నిషేధమని, చట్టాన్ని ఉల్లంఘించి ర్యాలీలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చిత్తూరు డిఎస్పి శ్రీనివాస్ మూర్తి ఆధ్వర్యంలో బందోబస్తు కొనసాగుతుందని, అలాగే ప్రత్యేక పోలీసు బృందాలు తరచూ కౌంటింగ్ కేంద్రాన్ని పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు.

# పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత:మేయర్

**విశాలాంధ్ర -చిత్తూరు :** నగరపాలక సంస్థలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని నగర మేయర్ ఎస్. అముద, కమిషనర్ అరుణ చెప్పారు. నగరపాలక సంస్థ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు బుధవారం ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. వైద్య శిబిరంలో సీఎంసీ ఆసుపత్రి వైద్యులు కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ ఎస్ అముద, కమిషనర్ జె అరుణ, డిప్యూటీ మేయర్లు ఆర్ చంద్రశేఖర్, రాజేష్ కుమార్ రెడ్డి సందర్శించారు. కార్మికులకు అవసరమైన అన్ని వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేయాలని సూచించారు. ఈ సందర్భంగా మేయర్, కమిషనర్, డిప్యూటీ మేయర్లు లు ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ అరుణ మాట్లాడుతూ నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో నగరపాలక పారిశుద్ధ్య కార్మికులు పాత్ర ఎనలేనిదన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సంక్షేమం, ఆరోగ్య పరిరక్షణకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. క్రమం తప్పకుండా వైద్య శిబిరాలు నిర్వహిస్తామన్నారు. సీఎంసీ వైద్యుల ఆధ్వర్యంలో జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, గైనిక్, డెంటల్, ఈఎన్టీ, ఆప్తమాలజీ విభాగాల్లో వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేసినట్లు చెప్పారు. వైద్య శిబిరంలో 320 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వైద్య పరీక్షలు అనంతరం వీరికి అవసరమైన మాత్రలు, టానిక్ లు అందించడం జరిగింది. కార్యక్రమంలో ఎంహెచ్వో డా.లోకేష్, శానిటరీ ఇన్స్పెక్టర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అన్నదానం

**విశాలాంధ్ర-కార్వేటి నగరం :** మండలంలోని డిఎం పురుగు ఉన్నత పాఠశాల విద్యార్థులకు అబ్దుల్ ఖాదర్, టెక్సమో బాబు జ్ఞాపకార్థం బుధవారం కే నాగరాజు ఆధ్వర్యంలో అన్నదానం వితరణ చేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ప్రతి ఏడాది విద్యార్థులకు అన్నదానం నిర్వహించడం జరుగుతుందన్నారు. పాఠశాలలో విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. పాఠశాలలో 166 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలియజేశారు. పాఠశాల లో పరిసరాలంతా పరిశుభ్రంగా ఉండడం పై సంతోషం వ్యక్తం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు నమఃశివాయ, ఉపాధ్యాయ బృందం విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## వేలం పాట ద్వారా రూ.5.18 లక్షలు ఆదాయం

**విశాలాంధ్ర-కార్వేటినగరం:** మేజర్ పంచాయతీ కార్వేటినగరంలో ఆధాయ వనరుల ద్వారా పంచాయతీకి రూ. 5.క్షల 18 వేల 500 ఆదాయం వచ్చినట్లు ఈవో పీఎస్ మణి తెలిపారు. బుధవారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ధనంజయవర్మ ఆధ్వర్యంలో పంచాయతీలోని ఆదాయవనరులకు బహిరంగ వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ వారపు సంత ద్వారా రూ.3లక్షల 88 వేలు, దినసరి కూరగాయల మార్కెట్ ద్వారా రూ.56 వేల 500లు, ప్రైవేటు బస్టాండు ద్వారా రూ.27 వేలు, జంతు వధశాల ద్వారా రూ.47 వేలు ఆధాయం వచ్చినట్లు పేర్కొన్నారు. పంచాయతీలోని ఆదాయ వనరుల ద్వారా వచ్చిన ఆదాయంతో పంచాయతీ అభివృద్ధికి వెచ్చించ నున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది. పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

## అవ్వ తాతలకు మూడవ తేదీన పింఛన్

**విశాలాంధ్ర-గంగాధర నెల్లూరు:** అవ్వ తాతలకు ఏప్రిల్ మూడవ తేదీ ప్రభుత్వం పెన్షన్లు అందిస్తామని పాలసముద్రం వైసీపీ మండల కన్వీనర్ తులసి రామ్ యాదవ్ తెలిపారు పాలసముద్రం మండలంలో బుధవారం నాడు జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ ఒకటి రెండో తారీకు ప్రభుత్వ సెలవులు అయినందున ప్రతినెల 1వ తారీఖున అందించే పెన్షన్లు ఏప్రిల్ నెల మాత్రం మూడో తారీఖున అందిస్తామని ఇందువల్ల పెన్షన్ దారులు ఎవరు కంగారు పడాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నులిపురుగుల నివారణలో అందరూ భాగస్వాములు కావాలి

**విశాలాంధ్ర కార్వేటినగరం :** విద్యార్థులు అందరూ అల్బెండ్జోల్ మాత్రలు వేసుకొని నులిపురుగుల నివారణలో భాగస్వాములు కావాలని ఎన్ ఎస్ ఎస్ యూనిట్, యూత్ రెడ్ క్రాస్ సెల్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ధనంజయ రెడ్డి పిలుపునిచ్చారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఎన్ ఎస్ ఎస్ యూనిట్,అర్ అర్ సీ విభాగములు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కార్వేటినగరం వారి సహకారం తో 370 మంది విద్యార్థులకు అల్బెంజొడల్ మాత్రలు పంచడము జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బాల సుబ్రహ్మణ్యం అచారి వ్యతిగత పరిశుభ్రత చాలా ముఖ్యం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మనిగండఎన్ , రాజసేఖర్,కార్తిక్, విష్ణుప్రియ తదితర ఉపాద్యాయులు, ఎన్ ఎస్ ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## రబీ సీజన్లో పంట నమోదు సరిచూసుకోండి

**విశాలాంధ్ర - పెద్దపంజాణి :** ఈ రబీ సీజన్లో కోగిలేరు రైతు భరోసా కేంద్రం పరిధిలో పంట నమోదు చేసుకొన్న రైతుల పంట వివరాలను గ్రామ పంచాయతీ నోటీస్ బోర్డు నందు మరియు రైతు భరోసా కేంద్రం నందు రైతుల సందర్శన కోసం ప్రదర్శించిచడం జరిగిందని, రైతులు అందరూ వారి వారి వివరాలను పరిశీలించి ఏవైనా కరెక్షన్స్ ఉంటే మా దృష్టికి తీసుకొచ్చినట్లైతే ఆ వివరాలను ఆన్లైన్లో సరిచేసి తరువాత ఫైనల్ లిస్ట్ ను రైతుల సందర్శన కోసం ప్రదర్శించడం జరుగుతుందని సచివాలయ సిరికల్చర్ అసిస్టెంట్ నరేష్ తెలిపారు. అలాగే ఈనెల 17 లో పంట నమోదు చేసుకొని రైతులకు కూడా తమ పండించిన పంటలను ఈక్రాప్ లో నమోదు చేసుకోవాలని సూచించారు. రైతులు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవ్వాలని కోరారు.

## 19న ఉగాది పురస్కారాల ప్రధానోత్సవం

**విశాలాంధ్ర-పలమనేరు :** ఈ నెల 19వ తేదీ ఆదివారం తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో కళామందిరంలో ఉగాది పురస్కారాల ప్రధాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు పి తులసినాథం నాయుడు తెలిపారు ముఖ్య అతిథిగా పంచ సహస్ర వదాన్ని మేడసాని మోహన్ ప్రముఖ రచయిత భూమన్ శ్రీకృష్ణదేవ రాయ విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి ఆచార్య కుసుమ కుమారిలు పాల్గొంటున్నారు. వివిధ రంగాలలో సేవలు అందిస్తున్న 25 మందికి ఉగాది పురస్కారాలు విద్యార్థులకు బహుమతులు అందిస్తున్నట్లు తెలిపారు.

## పాఠశాలకు బోరు మంజూరు

**విశాలాంధ్ర- పులిచెర్ల-కల్లూరు:** రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎంపీ వెంకట మిథున్ రెడ్డి సహకారంతో జడ్పీ నిధుల నుంచి కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాలకు బోరు మంజూరైనట్లు హెచ్ఎం పోకల తాతయ్య, ఆర్డబ్ల్యూఎస్ డీఈ రాజేంద్ర తెలిపారు. పాఠశాలకు మంజూరైన బోరును బుధవారం పేరెంట్స్ కమిటీ చైర్మన్ మహమ్మద్ రఫీ ,పాతపేట సర్పంచ్ నటరాజ పూజ చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకట సిద్దులు ,రాజేంద్ర ,సిద్దయ్య, పుష్పలత, కన్నగి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన గంగ జాతర



**విశాలాంధ్ర-కార్వేటినగరం :** మండల పరిధిలోని ఆర్కేవిబీపేట గ్రామంలో బుధవారం గంగమ్మ జాతర వైభవంగా ముగిసింది. మంగళవారం రాత్రి గంగమ్మకు ప్రతి ఇంట వద్ద భక్తులు కర్పూర హారతులు పట్టి ముక్కులు తీర్చుకున్నారు. గ్రామమంతా విద్యుత్ దీపాలతో నిండిపోయింది. యువత విచిత్ర వేష దారణలతో పలువురుని ఆకట్టుకుంది. వివిధ గ్రామాల నుండి వచ్చిన భక్తులు గంగమ్మను దర్శించుకుని మొక్కులు తెచ్చుకున్నారు. విధులల్లో వేపాకు తోరణాలు కట్టి, ఇంటింటి అంబళ్ళు పోశారు.వర్షాలు సకాలంలో పడి రైతులు సంతోషంగా ఉండేలా చూడాలని అమ్మవారిని కోరుకున్నారు.

## అంగన్వాడీ కేంద్రానికి ఫ్యాన్ బహూకరణ

**విశాలాంధ్ర-చౌడేపల్లి :** చౌడేపల్లి మండలం,చిత్రెడ్డి పల్లె అంగనవాడి కేంద్రం నందు పిల్లలు,అంగనవాడి కార్యకర్త నాగరత్నమ్మ ఆధ్వర్యంలో చిన్నారి నోషిత కృష్ణ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి.ఇందులో భాగంగా కేక్ కట్ చేసి చిన్నారికి శుభాకాంక్షలు తెలిపారు.అదేవిధంగా నోషిత కృష్ణ తల్లి తేజస్విని వేసవిని దృష్టిలో ఉంచుకొని అంగన్వాడి కేంద్రానికి ఫ్యాన్ బహుమతిగా ఇచ్చారు.ఈ సందర్భంగా తేజస్విని మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల్లో సౌకర్యాలు చాలా బాగున్నాయని,ఇక్కడ పిల్లలను ఎంతో బాగా చూసుకుంటున్నారని కితాబునిచ్చారు. అదేవిధంగా పిల్లల ఎదుగుదలకు మంచి పౌష్టికాహారం అందించడంతోపాటు మంచి విద్యా బోధన చేస్తున్నారన్నారు. అంగన్వాడీకి వచ్చే పిల్లలను ఇక్కడ సిబ్బంది తమ సొంత పిల్లల్లాగా చూసుకుంటున్నారని కొనియాడారు.అనంతరం అంబేద్కర్ భవన వ్యవస్థాపక అధ్యక్షులు,విశ్రాంతి డీసీసీబీ మేనేజర్ రెడ్డప్ప మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పిల్లల పుట్టినరోజు పిల్లల సమక్షంలో జరపాలని కోరారు.ఈ కార్యక్రమంలో కూరపత్తి శ్రీనివాసులు,డీలర్ రాధా మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రానికి గ్యాస్ స్టవ్ వితరణ

**విశాలాంధ్ర -పులిచెర్ల-కల్లూరు:** పులిచెర్ల మండలం కల్లూరు అంగన్ వాడి- 2 కేంద్రానికి చౌడేపల్లి కు చెందిన దాత మునిరాజ శెట్టి గ్యాస్ స్టవ్ ను వితరణగా అందజేసినట్లు అంగన్వాడీ కార్యకర్త అమృతకుమారి తెలిపారు .అంగన్ వాడి కేంద్రంలో బుధవారం దాత గ్యాస్ స్టవ్ ను అంగన్ వాడి కార్యకర్తకు అందజేశారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ చిన్నారుల భవిష్యత్తు కోసం అంగన్ వాడి కేంద్రానికి అన్ని విధాల సహకారం అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడి కార్యకర్త పార్వతి, సహాయకురాలు అన్మత్ తదితరులు ఉన్నారు.

## పదవ తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

**విశాలాంధ్ర- గంగాధర నెల్లూరు:** పదో తరగతి విద్యార్థుల పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డివైఈవో చంద్రశేఖర్ అన్నారు పాలసముద్రం మండలంలోని ఆముదాల పాలసముద్రం బలిజి కండిగ పాఠశాలలను ఆయన బుధవారం నాడు ఆకస్మిక తనిఖీ చేశారు ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని వారిపై ప్రత్యేక దృష్టి పెట్టి పాఠ్యాంశాలపై అవగాహన పెంచాలన్నారు తర్వాత మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేసి విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని అదేవిధంగా ప్రతిరోజు మెనూ ప్రకారం భోజనం పెట్టాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో ఎంఈఓ రాజేంద్రన్ ప్రధానోపాధ్యాయులు గణపతి మనోహర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర
తిరుపతి జిల్లా

# ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ పట్టభద్రుల రీపోలింగ్: కలెక్టర్

**విశాలాంధ్ర - తిరుపతి :** ప్రకాశం- నెల్లూరు- చిత్తూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసన మండలి ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తిరుపతిలో రెండు పోలింగ్ కేంద్రాల్లో రీ పోలింగ్ నేటి బుధవారం ప్రశాంత వాతావరణంలో ముగిశాయని, సహకరించిన అందరికీ జిల్లా కలెక్టర్ కె వెంకట రమణారెడ్డి ధన్యవాదాలు తెలిపారు.తిరుపతి నగరంలోని 229 పోలింగ్ కేంద్రం- ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, చిన్నబజారు వీధి, 233పోలింగ్ కేంద్రం - జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సత్యనారాయణ పురంలలో ఉదయం 8.00 గంటల నుండి సాయంత్రం 4.00 గంటల వరకు పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని ఇందుకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు అని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేశారని అన్నారు. 229 పోలింగ్ కేంద్రానికి శ్రీకాళహస్తి ఆర్డిఓ రామారావును, 233 పోలింగ్ కేంద్రానికి గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ ను ప్రత్యేక అధికారులు గా నియమించి పోలింగ్ కేంద్రం వెలుపల ఓటర్ స్లిప్పులు వీఆర్వోల ఏర్పాటుతో ఓటర్లకు అందజేయడం పర్యవేక్షణ మరియు పోలీసుల తో సమన్వయానికి నియమించడం జరిగిందని, వీటితో పాటు పిఓలు ఏపీవోలు ఓపివోలు మైక్రో అబ్జర్వర్ ఏర్పాటు, పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్ పోలింగ్ కేంద్రం వెలుపుల వీడియోగ్రఫీ ఏర్పాటు చేశామని తెలిపారు. పోలింగ్ ముగిసిన అనంతరం 229 పోలింగ్ కేంద్రంలో 579 ఓటర్లకు గాను 287 ఓటర్లు ఓటింగ్ వేయగా 49.57%, 233 పోలింగ్ కేంద్రం లో 792 ఓటర్లకు గాను 349 ఓటర్లు ఓటింగ్ వేయగా 44.07% ఓటింగ్ నమోదు వెరసి రీపోలింగ్ లో రెండు పోలింగ్ కేంద్రాలలో 1371 ఓటర్లకు గాను 356 మంది పురుషులు, 280 మహిళలు వెరసి మొత్తం 636 మంది ఓటింగ్ లో పాల్గొనగా నమోదైన పోలింగ్ శాతం 46.39% అని కలెక్టర్ తెలిపారు.పోలింగ్ ప్రక్రియ పూర్తి అయిన అనంతరం సీల్ చేసిన బ్యాలెట్ బాక్సులు సంబంధిత సామాగ్రితో బందోబస్తు నడుమ చిత్తూరు లోని స్ట్రాంగ్ రూముకు తరలించడం జరిగిందని తెలిపారు. అలాగే పోస్టల్ బ్యాలెట్ బాక్సును కూడా కలెక్టరేట్ నుండి బందోబస్తు నడుమ ప్రత్యేక వాహనంలో చిత్తూరు స్ట్రాంగ్ రూమ్ కి తరలించడం జరిగిందని తెలిపారు.

# ప్రతిరోజు పోషకాహారాన్ని తీసుకోండి:సర్పంచ్

**విశాలాంధ్ర- ఏర్పేడు:**ఏర్పేడు మండలం యం డి పుత్తూరు గ్రామంలో అంగన్వాడీ కేంద్రం నందు బాలింతలకు గర్భిణీ స్త్రీలకు వైయస్ఆర్ సంపూర్ణ పోషణ ఆహారపదార్థాలను అందచేయు కార్యక్రమం నిర్వహించబడినది. ఈ కార్యక్రమమునకు ముఖ్య అతిథిగా సర్పంచ్ మోహన ప్రియ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్రతిరోజు పోషకాహారాన్ని తప్పక తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని వైయస్ఆర్ సంపూర్ణ పోషణ ఆహారపదార్థాలను జగనన్న ప్రభుత్వం ఎంతో నాణ్యతగా అందజేస్తున్నారని వాటిని పూర్తిగా వినియోగించు కోవాలన్నారు. అంతేకాకుండా తరచుగా ఆరోగ్య పరీక్షలు చేయించుకొని తగిన చికిత్సలు తీసుకుంటూ ఆరోగ్యంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచరు విమలకుమారి మహిళా సంరక్షణ కార్యదర్శి ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.

అప్పీల్ కి ఏమని వెళ్ళారు...

# న్యాక్ కమిటీ బయట పెట్టిన విషయాలు, వాస్తవాలు కాదని నిరూపిస్తారా

## సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామా నాయుడు

**విశాలాంధ్ర - తిరుపతి :** ఎస్వీ యూనివర్సిటీ ని గత వారం న్యాక్ కమిటీ సందర్శించిన విషయం అందరికి తెలిసిందే, కానీ నేడు న్యాక్ కమిటీ విడుదల చేసిన ర్యాంకింగ్ లో యూనివర్సిటీ స్థాయి ని తగ్గించే విధంగా ఉందని గతం లో, ఏ ప్లస్ ఉంటే నేడు ఏ గ్రేడ్ కి పరిమితం చేస్తా ప్రకటన విడుదల చేయడం పట్ల మన యూనివర్సిటీ ఉన్నత స్థాయి అధికారుల నిర్లక్ష్యం అనే ఏద్దేవ చేసారు.యూనివర్సిటీ లో ఖాళీగా వున్నా ప్రొఫెసర్ పోస్టులు ను భర్తీ చేయాలనీ, విద్యార్థులకి మౌలిక వసతులు కల్పించాలని, ల్యాబ్ లను శుభ్రంగా ఉంచి విద్యార్థులకి నిరంతరం అందుబాటులో ఉంచమని కమ్యూనిస్ట్ లుగా, విద్యార్థి సంఘాల అనేక సార్లు వినతిపత్రాలు, నిరసన కార్యమాలు చేసిన, యూనివర్సిటీ అధికారులు నిర్లక్ష్యం గా వ్యవహారించడం వల్లే మనకు రావలిసిన న్యాక్ గ్రేడ్ తగ్గిందని తెలియ చేశారు.

# ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం

**విశాలాంధ్ర - తిరుపతి :**మధ్యాహ్నం మూడు గంటలకు తిరుపతి విశ్వం టాలెంట్ స్కూల్ నందు గల వినియోగదారుల క్లబ్ మరియు జిల్లా వినియోగదారుల సమాచార కేంద్రం ఆధ్వర్యంలో" ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం" నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు ఈ.రాజారెడ్డి మాట్లాడుతూ విద్యార్థి స్థాయి నుండి వినియోగదారులుగా మనకున్న హక్కులను బాధ్యతగా తెలుసుకొని కొన్న ప్రతి వస్తువు ఒక బిల్లు, గ్యారెంటీ కార్డు లాంటివి తీసుకొని మనకు నష్టం అన్యాయం జరిగినప్పుడు అప్పటికప్పుడే ప్రశ్నించి న్యాయం పొంది, ప్రతి విద్యార్థి విజ్ఞానవంతుడైన వినియోగదారులుగా భవిష్యత్తులో సమాజాన్ని చైతన్యవంతులు చేయడం ఓ సామాజిక బాధ్యతగా కృషి చేయాలని కోరారు, హక్కులను,చట్టాల్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఎక్కువగా నాణ్యతలేని జంక్ ఫుడ్స్ తినడం వల్ల చిన్నతనంలోనే కంటి చూపు, జ్ఞాపకశక్తి తగ్గడం లాంటి ప్రమాదకరమైన వ్యాధులకు బలవుతున్నారని ప్రతి విద్యార్థి కల్తీల విషయంలో అప్రమత్తతగా ఉండాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మావతి మహిళా కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ స్వర్ణా లక్ష్మి, అప్పాస్మా తిరుపతి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.రవీంద్ర రెడ్డి, ఓ.వెంకట రమణ రెడ్డి పాల్గొన్నారు.

# వాణిజ్య సముదాయంతో కార్పొరేషన్‌కి ఆదాయం : కమిషనర్

**విశాలాంధ్ర - తిరుపతి :** తిరుపతి కపిలతీర్థం నంది సర్కిల్ వద్ద నిర్మిస్తున్న వాణిజ్య సముదాయల భవనాన్ని బుధవారం తిరుపతి నగరపాలక సంస్థ కమిషనం అనుపమ అంజలి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మరో నెలలోపు ఈ వాణిజ్య సముదాయ భవనాన్ని పూర్తి చేసి ప్రారంభించడం జరుగుతుందన్నారు. రెండు కోట్ల రూపాయాల వ్యయంతో పది వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడు అంతస్థుల భవనాన్ని నిర్మించి నగరపాలక సంస్థకు ఆదాయం వచ్చేలా అద్దెకివ్వడం జరుగుతుందన్నారు. మునిసిపల్ కార్పొరేషన్ కి ఆదాయ వనరులు పెంచేందుకు మరిన్ని వాణిజ్య సముదాయాల రూపకల్పనకు ప్రయత్నిస్తున్నట్లు ఆమె తెలిపారు. తుది దశ నిర్మాణంలో వున్న భవనపు పనులను వేగవంతం చేయాలని అధికారులకు సూచనలు జారీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మునిసిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, ఏయికామ్ ప్రతినిధి భాలాజీ పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి ఇన్స్పైర్ పోటీలకు ఓబులాయపల్లి విద్యార్థి

**విశాలాంధ్ర - శ్రీకాళహస్తి :** రాష్ట్రస్థాయి ఇన్స్పైర్ పోటీలకు ఓబులాయపల్లిలోని జడ్పీ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని సి.విష్ణు ప్రసన్న ఎంపికైంది. ఈ నెల 9,10 తేదీల్లో ఉమ్మడి చిత్తూర్ జిల్లా స్థాయి ఇన్స్పైర్ ప్రాజెక్టుల ఎంపిక ఆన్లైన్‌లో జరిగింది. ఓబులాయిపల్లి హై స్కూల్ విద్యార్థిని ప్రాజెక్ట్ "ఎకో కూలర్" రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసినట్లు జిల్లా కమిటీ ప్రకటించింది. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థిని సి.విష్ణు ప్రసన్నను, సైన్సు ఉపాధ్యాయులను తిలక్ కుమార్ భాష ప్రధానోపాధ్యాయులు ఎ. బాలయ్య, గ్రామస్తులు అభినందించారు.

# పన్నుల బకాయిలపై బకాయిదారులకు అవగాహన

**విశాలాంధ్ర - శ్రీకాళహస్తి :** శ్రీకాళహస్తి పట్టణము నందలి ఇంటి పన్నులు, ఖాళీజాగా పన్నులు, కొళాయి పన్నుల బకాయిలుదారులకు పన్నుల చెల్లింపుపై పురపాలక సంఘం అధికారులు, సచివాలయ సిబ్బంది అవగాహన కల్పించారు. శ్రీకాళహస్తి పురపాలక సంఘ కమిషనరు బి. బాలాజీ నాయక్ ఆదేశముల మేరకు శ్రీకాళహస్తి పట్టణము నందలి ఇంటి పన్నులు, ఖాళీజాగా పన్నులు, కొళాయి పన్నుల బకాయిలు అధికముగా ఉన్నందున సదరు బకాయిలను వసూలు చేయుటకు గాను పురపాలక సిబ్బంది, సచివాలయ సిబ్బంది వారిని ప్రత్యేక బృందములుగా ఏర్పడి ప్రజలను చైతన్యపరచి అవగాహన కల్పించారు. పన్నులను సకాలము లో చెల్లించని యెడల ప్రతి మాసమునకు అపరాధ రుసుముతో పాటుగా చెల్లించవలసివస్తుందని ప్రజలకు తెలియజేశారు. సెలవు దినములలో కూడా పురపాలక సంఘము నందు ఏర్పాటు చేసిన కౌంటర్ నందు పన్నులను చెల్లించవచ్చునని చెప్పారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసరు పి.యం.వి. నారాయణ రెడ్డి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ లు బి. బాల చంద్రయ్య, రవికాంత్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఐదు కేంద్రాలలో ఇంటర్ పరీక్షలు

**విశాలాంధ్ర - గూడూరు :** గూడూరు పట్టణంలో ఐదు కేంద్రాలలో బుధవారం జూనియర్ ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమ య్యాయి. విద్యార్థులను కుణ్ణంగా తనిఖీ చేసి పరీక్ష హాల్లోకి పంపించారు. రాష్ట్ర వ్యాప్తంగా నేటి నుండి ప్రారం భమైన జూనియర్ ఇంటర్ పరీక్షలు గూడూరు పట్టణంలో ఐదు కేంద్రాల్లో జరుగుతున్నాయి. మొత్తం 1460 మంది విద్యార్థిని విద్యార్థులు ఉన్నారు. తొలిరోజు కావడంతో తల్లిదండ్రులు తమ పిల్లలను పరీక్షా కేంద్రాలకు తీసుకువచ్చి ఆందోళన చెందవద్దని తెలిపారు. ఈ సంవత్సరం పరీక్షా కేంద్రంలోకి తల్లిదండ్రులను అనుమతించకపోవడంతో బయట నుండి తమ పిల్లలు రూమ్ కి వెళ్లారో లేదో అని ఆందోళన చెందుతూ కనిపించారు.

# స్వయం సహాయక సంఘాలకు అండగా సప్తగిరి గ్రామీణ బ్యాంకు

**విశాలాంధ్ర-తొట్టంబేడు:** స్వయం సహాయక సంఘాలకు అండగా ఉంటామని సప్తగిరి గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజరు జి.జయకుమార్ చెప్పారు. తొట్టంబేడు సప్తగిరి గ్రామీణ బ్యాంకులో బుధవారం స్వయం సహాయక సంఘాల మహిళలకు రుణాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి జయకుమార్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాలకు రుణమేళా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. సప్తగిరి గ్రామీణ బ్యాంకులో మహిళా ఖాతాదారుల సంఖ్య అధికంగా ఉందన్నారు. బ్యాంకు ఆర్థికంగా విజయం సాధించడంలో మహిళల పాత్రే ప్రధానమని ఆయన కొనియాడారు. మహిళా ఖాతాదారులకి ప్రత్యేక సేవలందించేందుకు తాము ప్రత్యేకంగా కొన్ని బ్యాంకు శాఖలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గత 30 రోజుల వ్యవధిలో తమ బ్యాంకు తిరుపతి రీజియన్ పరిధిలో రూ.125 కోట్లు మేర స్వయం సహాయక సంఘాలకు రుణ వితరణ జరిపినట్లు జయకుమార్ వివరించారు. స్వయం సహాయక సంఘాలు మినిట్స్ రిజల్యూషన్ లని, అలాగే కంతుల వారీ జరిపే రీపేమెంట్ లను సక్రమంగా చూసుకోవాలని మోసపూరిత వ్యవహారాలకు ఆస్కారం లేని విధంగా అన్ని రంగాలలో చురుకుగా వ్యవహరించాలని సూచించారు. అనంతరం లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేసి వారి ఆర్థికాభివృద్ధి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ దినేష్, బ్యాంకు ఇతర శాఖల అధికారులు, ఖాతాదారులు పాల్గొన్నారు.

# తడ,సూళ్లూరుపేటలో దొంగల ముఠా హల్ చల్

**అంతరాష్ట్ర దొంగల ముఠా గా అనుమానం -షాపులనే టార్గెట్టుగా చోరీ యత్నాలు -ఐదుగురు దొంగలు ఉన్నట్లు అనుమానం**

**విశాలాంధ్ర - సూళ్లూరుపేట :** సూళ్లూరుపేట , తడ పట్టణాలలో మంగళవారం అర్ధరాత్రి దొంగలు హల్ చల్ చేశారు,సూళ్లూరుపేట పట్టణం లో మూడు చోట్ల చోరీకి విఫలయత్నం చేశారు, అలాగే తడ లో కూడా మూడు చోట్ల చోరీకి ప్రయత్నించి ఉన్నారు, సూళ్లూరుపేట లోని మోర్ సూపర్ మార్కెట్ షెట్టర్ తాళాలు పగలగొట్టి అద్దాలను బండరాళ్లతో కొట్టి లోనికి ప్రవేశించి ఉన్నారు,లోపల కంప్యూటర్ల క్రింద ఉండే కాష్ డ్రాలను పగలకొట్టే ప్రయత్నం చేశారు , అలాగే వెంకటేశ్వర స్వామి ఆలయం ఎదురుగా ఉన్న పాన్ బ్రోకర్స్ షాపు తాళాలు కూడా పగలగొట్టారు కానీ లోనికి వెళ్లలేక పోయారు ,దానికి ఎదురుగా ఉన్న పాత అష్టలక్ష్మి సూపర్ మార్కెట్ షెట్టర్ తాళాలు కూడా పగలగొట్టి చోరీకి ప్రయత్నించి ఉన్నారు, తమిళనాడు కు చెందిన ఐదుగురు దొంగలు ఇలా హల్ చల్ చేసినట్లు సీసీ కెమెరాలలో రికార్డు ఐన వీడియోను బట్టి తెలుస్తుంది ,చెన్నై నుండి ముందుగా తడ లో చోరీలకు ప్రయత్నించి అనంతరం సూళ్లూరుపేట లోకూడా చోరీలకు పాల్పడినట్లు తెలుస్తుంది. తడ లో రెండు చోట్ల చోరీకి విపయత్నం చేసిన దొంగలు ఓ సెల్ ఫోన్ షాపులో మాత్రం కొన్ని సెల్ ఫోన్స్ తో పాటు 20 వేలు నగదు చోరీ చేసినట్లు తెలిసింది. దొంగలు రెండు మోటర్ బైకుల్లో వచ్చారు,అందరు ముసుగులు ధరించి ఉన్నారు. విషయం తెలుసుకున్న వెంటనే సులూరుపేట ఎస్సై రవి బాబు తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు ,త్వరలోనే ఈ దొంగతనం చేసిన వారిని పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

# కళాకారుడు మణి మృతికి సంతాపం

**విశాలాంధ్ర - తిరుపతి :**ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి మాజీ కళాకారులు కె ఎస్ మణి మృతి సాంస్కృతిక లోకానికి తీరని లోటని ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య , రాష్ట్ర ఉపాధ్యక్షులు యన్. గుర్రప్ప , తిరుపతి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చింతా రవి, జె. నాగరాజు , చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎం . సుబ్రమణ్యం , సూరి తదితరులు నేడోక ప్రకటనలో ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య మాట్లాడుతూ కె యస్ మణి అనేదాని కంటే ప్రజానాట్యమండలి మణి గా పేరు తెచ్చుకున్నాడని అన్నారు . ఇదా ప్రజా రాజ్యమా , ఇదా ప్రజా స్వామ్యమా... నిదానించి మదిన గాంచి యదార్థంబు తెలుపుమా నా సోదర బలగమా... ఓ మేధావి వర్గమా అంటూ తన గాత్రం ద్వారా గల్లీ నుండి ఢిల్లీ దాకా వినిపించిన మహా గాయకుడనీ కొనియాడారు . ఈయన మృతి కళా రంగానికి తీరని లోటని పేర్కొ న్నారు. మణి మృతికి సంతాపం వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# టీడీపీ నేత చెంచురామానాయుడు మృతి తీరనిలోటు

**విశాలాంధ్ర-తొట్టంబేడు:** తొట్టంబేడు మండలం పెన్నలపాడు పంచాయతీ కొన్నలి గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత తెల్లపల్లి చెంచురామానాయుడు మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ మండల అధ్యక్షులు గాలి మురళీనాయుడు అన్నారు. కొన్నలిలో బుధవారం ఆయన చెంచు రామానాయుడు పార్థివ దేహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకు న్నారు. అనంతరం శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్చార్జి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి చరవాణి ద్వారా చెంచురామానాయుడు కుమారుడు జానకిరామ్, తమ్ముడు రామచంద్ర నాయుడు ను పలకరించారు. వారి కుటుంబానికి తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. బొజ్జల గోపాల కృష్ణారెడ్డి సతీమణి బొజ్జల బృందమ్మ, రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు, పాల సొసైటీ మాజీ చైర్మన్ రావిళ్ళ ముని రాజా నాయుడు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు భాస్కరనాయుడు, వెంగళరావు, భార్గవ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

# ఏసీబీ వలలో చిక్కిన తడ కండ్రిగ పంచాయతీ సెక్రెటరీ

**విశాలాంధ్ర -సూళ్లూరుపేట :** ఇంటి ప్లాన్ అప్రూవల్ కోసం ఓ వ్యక్తి తడకండ్రిగ గ్రామపంచాయతీ సెక్రటరీ నీ అప్రూవల్ కోరగా తనకు డబ్బులు ఇస్తే తప్ప అప్రూవల్ అవ్వదని చెప్పడంతో అప్రూవల్ కోసం విసిగిపోయిన బాధితుడు ఏసీబీ వాళ్ళని ఆశ్రయించారు. బాధితుడు నుండి తడ కండ్రిగ సెక్రటరీ రమణయ్యకు 40 వేలు రూపాయలు లంచం తీసుకుంటూ ఉండగా ఏసీబీ అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. తడ కండ్రిగ గ్రామ పంచాయతీ కార్యాలయంలో అన్ని రికార్డ్స్ ను ఏసీబీ అధికారులు పరిశీలించారు. ఏసీబీ రైడ్స్ తో అప్రమత్తమైన తడ మండలం అధికారులు. తిరుపతి ఏసీబీ అధికారి దేవి ప్రసాద్ తన బృందంతో ఈ దాడుల్లో పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ఇంటర్ పరీక్షల ప్రారంభం

**విశాలాంధ్ర- సత్యవేడు:** సత్యవేడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ పబ్లిక్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి.తొలి రోజు ఇంటర్ మొదటి సంవత్సర విద్యార్థులు 340 మంది హాజరు కావలసి ఉండగా 330 మంది హాజరైనట్టు కళాశాల ప్రధాన పరీక్షల చీఫ్ అనిల్ కుమార్ పేర్కొన్నారు.తెలుగు,తమిళం,సంస్కృతం మాధ్యమంలో విద్యార్థులు పరీక్షలు రాశారు.ఈనేపధ్యంలో 13 గదులలో విద్యార్థులకు పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు.కాగా సీసీ కెమెరాల నిఘా నీడలో విద్యార్థులు పరీక్షలు రాయడం జరిగింది.పరీక్షలకు అనుగుణంగా విద్యార్థులకు అవసరమైన డెస్కును ఇంటర్ అధికారులు ఏర్పాటు చేశారు.పరీక్షలను డిపార్ట్మెంట్ అధికారి విజయ్ కుమార్ పర్యవేక్షించారు. మార్చి 15వ తేదీ నుంచి ప్రారంభమైన ఇంటర్ పరీక్ష 29 వరకు జరగనున్నాయి.

# రాష్ట్రస్థాయి ఇన్స్పైర్‌కు గ్రామీణ విద్యార్థి ఎంపిక

**విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ:** ఆలత్తూరు గ్రామంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న విద్యార్థి సైన్స్ ఇన్స్పైర్‌కు ఉపాధ్యాయుడు మూగాల వెంకటేశ్వర్లు సూచనల మేరకు ప్రధానోపాధ్యాయుడు కే శ్రీనివాస్ ప్రోత్సాహంతో ఎంపికైనాడు. ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయికి ఎంపికైన 797 ప్రాజెక్టులలో అప్లోడ్ చేసిన 770 ప్రాజెక్టులను ఈనెల 9, 10 రెండురోజుల పాటు ఆన్ లైన్ ప్రక్రియ జరిగింది. ఇందులోనే జడ్జిమెంట్ జరిగింది.ఈ జడ్జిమెంట్ (ఎన్ఐఎఫ్) ఢిల్లీ వారు మరియు జిల్లాలో ఎంపిక చేసిన 14 మంది జ్యూరీ మెంబర్స్ తో సంయుక్తంగ జడ్జిమెంట్ జరిగినది.ఈ 770 ప్రాజెక్టుల నుండి రాష్ట్ర స్థాయికి 78 బెస్ట్ ఇన్స్పైర్ ప్రాజెక్టులను(ఇన్నోవేషన్స్) ఎంపిక చేసారు. అందులో భాగమే ఉమ్మడి చిత్తూరు జిల్లా తిరుపతి జిల్లాకు చెందిన బుచ్చినాయుడు మండలం ఆలత్తూరు గ్రామీణ విద్యార్థి రాష్ట్ర స్థాయి కి ఎంపికైనాడు, నేటి దినాలలో గ్రామీణ ప్రాంతాల్లో వీధులలోని చెత్త కుండీలు చెత్తలో నిండిన వెంటనే సంబంధిత అధికారులకు సరైన సమాచారం లేక సకాలంలో చేతను తొలగించలేక కష్టపడుతున్నటువంటి దినాలలో సులువైన పద్ధతిని విజ్ఞాన శాస్త్రం ద్వారా ఈ విద్యార్థి ఈ సమస్య పరిష్కార కోసము ఆధునిక చెత్తకుండీని (స్మార్ట్ డేస్ట్ బిన్ విత్, ఐఒటి, నోటిఫికేషన్)ను కనిపెట్టాడు. విద్యార్థి తెలివికి రాష్ట్ర స్థాయికి ఎంపికైనవారు ఈ నెల 23,24 వ తేదీలలో జిల్లా విద్యాశాఖ కార్యాలయం కాకినాడ ఆవరణలో రాష్ట్ర స్థాయి ఇన్స్పైర్ ఎక్సిబిషన్ జరుతుంది. రాష్ట్ర స్థాయిలో గెలుపొందిన వారు అక్కడ నుండి జాతీయ స్థాయికి ఎంపిక చేస్తారు. విద్యార్థి ఎంపీకపై మండల విద్యాశాఖ అధికారికే రవీంద్రనాథ్ హర్షం వ్యక్తం చేశారు.

# పదిపై పర్యవేక్షణ లేమి-వసతి గృహాలలో కొలత భత్యం

**విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ:** మండల కేంద్రంలోని ఎస్సీ బాలికల బాలుర వసతి సంక్షేమ గృహాలలో పదవ తరగతి విద్యార్థుల విద్యపై బుధవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎల్ విజయ కుమారి ఆకస్మికంగా పర్యవేక్షించారు. వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తున్న పదవ తరగతి బాల బాలికల చదువుపై వారి సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు, పాఠశాలలతో పాటు వసతి గృహాలలో కూడా పదవ తరగతి విద్యార్థుల చదువుపై ప్రత్యేక బోధన సిబ్బందితో తరగతులను ప్రభుత్వం నిర్వహిస్తున్నది. వసతి గృహాలలో సంక్షేమ అధికారులు జాడ లేకపోవడంతో విద్యార్థులు పర్యవేక్షణ లోకం కారణంగా సందేహ నివృత్తి చేసుకోలేక ఆందోళన చెందుతున్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు పదవ తరగతి పరీక్షల కీలకం, విద్యార్థులపై పర్యవేక్షణ కొరవడంతో విద్యార్థులు విచ్చలవిడిగా గాలికి తిరుగుతున్నారు, వారికి అందిస్తున్న భోజనాలు సౌకర్యం అరాకొరగా కొలత భత్యంతో అందించడం వలన విద్యార్థులు అర్థ ఆకలితో అలమటిస్తున్నారు. విద్యార్థులు సౌకర్యాలు లేమీ పై ప్రధానోపాధ్యాయురాలు ఆగ్రహం చెందారు. ఇలా అయితే పది ఫలితాలు సాధించడంలో వెనుకబడినవారము ఔతామని వాపోయారు, ప్రధానోపాధ్యాయురాలు వెంట సిపిఐ మండల కార్యదర్శి కత్తి ధర్మయ్య పాల్గొన్నారు.

# అక్షయక్షేత్రంలో హిమంషి జన్మదిన వేడుక

**విశాలాంధ్ర - రేణిగుంట :** యువనేస్తం అసోసియేషన్ ఆధ్వర్యంలో రేణిగుం అక్షయ క్షేత్రంలో బుధవారం సరస్వతి కండ్రిగ గ్రామానికి చెందిన బి. నాగేంద్ర బాబు , స్వప్న కుమార్తె హిమంషి మొదటి జన్మదిన వేడుకను నిర్వహించారు. రేణిగుంట అక్షయ క్షేత్రం లో60 మంది అనాథలకు మరియు వికలాంగులకు టిఫిన్ పంపిణీ చేయడం జరిగిందని యువనేస్తం అసోసియేషన్ అధ్యక్షులు మునిశేఖర్ యువనేస్తం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు వినోద్ తెలిపారు. ఈ సంద ర్భంగా మునిశేఖర్, వినోద్ లు మాట్లాడుతూ ఎంతో మంది అనా దలు, వికలాంగులు దాతల సహాయం కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. అనాథలకు, వికలాంగులకు అన్నదానం చేయడానికి దాతలు ముందుకు రావాలని కోరారు. సరస్వతి కండ్రిగ గ్రామానికి చెందిన బి. నాగేంద్ర బాబు , స్వప్న కుమార్తె హిమంషి లకు యువ నేస్తం అసోసియేషన్ తరపున ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కనకమ్మ , నగేష్, వెంకటేష్, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ఇంటర్మీడియట్ పరీక్షలు

**విశాలాంధ్ర-తొట్టంబేడు:** తొట్టంబేడు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం ప్రారంభమైన ఇంటర్మీడియట్ మొదటి సంవత్సర పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షా కేంద్రంలో 425మంది విద్యార్థులకు గాను 415 మంది హాజర య్యారు. పది మంది విద్యార్థులు హాజరు కాలేదు. పరీక్షల నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు జాగ్రత్తలు తీసుకున్నారు. పరీక్ష కేంద్రం వద్ద పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. కాపీయింగ్, మాల్ ప్రాక్టీస్ జరగకుండా పరీక్షా కేంద్రంలోని ప్రతి గదిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

**మహారాజశ్రీ గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**

OS.No : 39 OF 2021

Andhra Pragathi Grameena Bank, guduru Branch (Rep. by its Branch Manager). - వాది

Vs

Derangula Venkataiah & 3 others -ప్రతివాదులు

To

Derangula Chandra Sekhar (D.2)
S/o Venkataiah, R/o Karaballavolu,Ozili Mandal, Tirupathi Dist.

Chittamuru Surya Narayana Reddy (D.4)
S/o Venku Reddy,
R/o Karaballavolu Village, Ozili Mandal,
Tirupathi Dist.

Derangula Guravaiah (D.3)
S/o Venkataiah,
R/o Karaballavolu Village,
Ozili Mandal,
Tirupathi Dt.

**దావానోటీసు**

పై నెంబరు దావాలో పరిహారం లోను రికవరీ నిమిత్తం వాది మీమీద దావా దాఖలు చేసి ఉన్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం తే.18-04-2023దికి వాయిదా వేసి ఉన్నారు. కావున వాయిదా రోజు ఉదయం 10.30 గంటలకు మీరు స్వతహాగాగాని, సంపూర్ణముగా సంజాయిషీ పొందిన అన్ని ప్రశ్నలకు ఉత్తరములు చెప్పగూడిన ప్లీడరు ద్వారాగాని పై కోర్టులో హాజరై ఆక్షేపణలు ఉన్నయెడల తెలుపుకోవచ్చును. లేనియడల పై విషయము మీ పరోక్షములో తీర్మానించబడును.

ఇట్లు
చిల్లకూరు రఘునాథరెడ్డి,
వాది తరపున న్యాయవాది.

**GENERAL NOTICE**

My client state that one P.Eswar Reddy, aged about 55 years, S/o. P.Sada Siva Reddy, residing at D.No.14-151, GVP Colony, Tadipatri, Ananthapuram District. He has approached our bank for obtaining loan against the schedule property mentioned below on perusal of Document the said P.Eswar Reddy,S/o. P.Sada Siva Reddy has devoiced title under registered Sale Deed vide D.No.6120/2021, dated 29-12-2021 through his low executors subsequently. He lost the original document during transportation inspite of his best effects, but he could not traced the original documents then he lodged complaint before Tadipatri, Rural circle for the loss of document after due probe the police issued non traceable certificate to the said document.

Hence, I therefore hereby call upon General Public if anybody is having any claim title deed interest financial commitments or objections over sale deed please appraise the within three (3) days from the date of publication.

**Schedule :** Chittoor Dist, Sri Balaji Regd.dist., Tirupti Rural Mandal, No.53 Peruru S.No.556, 13th Ward GO's colony residency area an extent of 1761 sq.fts, plot No.101, Nanda view apartment.

**Arigala Prabhakar, M.A., BL.,**
**Advocate, Tirupathi,**